


తెలుగు జాతీయ దినపత్రిక
# అక్షర విజేత
నిజం నిర్భయం నిష్పక్షం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక




ఆంధ్రప్రదేశ్ సంపుటి:05 సంచిక :110 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజీలు : 10, వెల. 6రూ/ శనివారం14 ఫిబ్రవరి 2026

# వాకౌట్ చేయడం
# వైసీపీకి ఫ్యాషన్‌గా మారింది

**-వైసీపీ హయాంలో రూ.4064.59 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయన్న మంత్రి**
**-వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడి**
**-ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదన్న మంత్రి నారా లోకేశ్**
**-శాసనమండలిలో వైసీపీని నిలదీసిన నిలదీసిన మంత్రి నారా లోకేశ్**



వైసీపీ హయాంలో రూ.4064.59 కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని విద్య, ఐటీ శాఖల మంత్రి మంత్రి నారా లోకేశ్ అన్నారు. వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే వీటిపై చర్చించేందుకు రావాలని, తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదని హితవు పలికారు. వాకౌట్ చేయడం వైసీపీకి ఫ్యాషన్‌గా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. ముందుగా మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ, విపక్ష నేత బొత్స సత్యనారాయణ మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు అన్న కాంటీన్లు మూసివేయబోమని సభలో చెప్పి మాటతప్పారని, ఇప్పుడు వైసీపీ పాలనలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు లేవంటూ నీతులు చెబుతున్నారని అన్నారు.

## రణవీర్ సింగ్ ను చంపేస్తామంటూ
# బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులు

-డైరెక్టర్ రోహిత్ శెట్టికి కూడా వార్నింగ్
-వారి వద్ద పనిచేస్తున్న వారిని హత్య చేస్తామని హెచ్చరిక
-వాట్సాప్ లో ఆడియో మెసేజ్ పంపిన దుండగుడు



## ఎన్నికలకు ముందు మహిళలకు సీఎం స్టాలిన్ 'ముందస్తు' కానుక

మహిళలకు ముందస్తు మూడు నెలల ప్యాకేజీని విడుదల చేసిన స్టాలిన్ ప్రభుత్వం
1.31 కోట్ల మంది మహిళలకు లబ్ధి
ఈ ఏడాది ప్రథమార్థంలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు



## పూర్తి గీతాన్ని ఆలపించాలన్న కేంద్రం నిర్ణయాన్ని స్వాగతించాలి

రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి



## తిరుమలలో అపచారాలకు
# నాటి పాలక మండలే కారణం

**-రూ.10 కోట్లతో నిర్మించిన శ్రీకాళహస్తి గిరిప్రదక్షిణ మార్గాన్ని ప్రారంభించిన పవన్ కళ్యాణ్**
**-పాలకమండళ్లు బాధ్యతగా ఉంటే ఆలయాల్లో అపచారాలు జరగవని వ్యాఖ్య**



పాలక మండళ్లు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే దేవాలయాల్లో ఎలాంటి అపచారాలు, తప్పులు జరగవని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమల వంటి పుణ్యక్షేత్రంలోనే ఎన్నో అపచారాలు జరిగాయని, నాటి పాలక మండలి సరిగ్గా పనిచేసి ఉంటే ఆ పరిస్థితి వచ్చేది కాదని ఆయన విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా ఆలయాలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సూచించారు.

## అంబటిని వేధించిన వారంతా మూల్యం చెల్లించుకోక తప్పదు

వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ



## పేర్ని నానికి నోటీసులు ఇవ్వండి: - ఏపీ హైకోర్టు

**చంద్రబాబు, పవన్‌లను దూషించిన కేసు**
**పేర్ని నాని క్వాష్ పిటిషన్ ను కొట్టివేసిన హైకోర్టు**
**నోటీసులు ఇచ్చి విచారించాలని హైకోర్టు ఆదేశం**

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లను దూషించిన అంశానికి సంబంధించి మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నానిపై మచిలీపట్నం ఇనగుదురుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ ఏపీ హైకోర్టులో పేర్ని నాని క్వాష్ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ ను నిన్న విచారించిన హైకోర్టు పేర్ని నానికి నోటీసులు ఇవ్వాలని ఆదేశించింది. పేర్ని నానిపై నమోదైన కేసులు ఏడేళ్లలోపు శిక్షకు సంబంధించినవేనని... క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 35(3) ప్రకారం ఆయనకు నోటీసులు ఇచ్చి, విచారణ కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసింది. పేర్ని నాని క్వాష్ పిటిషన్ ను కొట్టివేసింది. తదుపరి విచారణను మార్చి 12వ తేదీకి వాయిదా వేసింది.



## దేవాలయాల పవిత్రతను
# కాపాడతాం

**గత పాలనలో భూ వివాదాలపైనే ఎక్కువ ఫిర్యాదులు అందాయన్న సీఎం**
**2026 నాటికి రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన చేపడతామని వెల్లడి**
**తిరుపతి లడ్డూ వివాదంలోకి హెరిటేజ్‌ను లాగి బ్రాండ్ దెబ్బతీశారని ఆగ్రహం**
**దేవాలయాల పవిత్రతను కాపాడతామని స్పష్టీకరణ**

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని, పాలకులు అసెంబ్లీలో తనను అవమానించిన తీరుకు కన్నీళ్లు పెట్టుకున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తనలాగే 2019-24 మధ్య ఎందరో కన్నీళ్లు పెట్టుకున్నారని, ప్రజలు అన్నింటినీ గమనించి సరైన సమయంలో తీర్పు ఇచ్చారని అన్నారు.



# రణవీర్ సింగ్‌ను చంపేస్తామంటూ బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులు

బాలీవుడ్ లో ప్రముఖ నటుడు రణ్ వీర్ సింగ్ కు బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపులు వచ్చాయి. రణ్ వీర్ ను, అతడి వద్ద పనిచేస్తున్న వారినీ చంపేస్తానని దుండగుడు హెచ్చరించాడు. ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టికి కూడా ఇదే తరహా బెదిరింపులు చేశాడు. ఈ మేరకు వాట్సాప్ లో ఓ ఆడియో సందేశం పంపించినట్లు సమాచారం. ఈ మెసేజ్ తో బాలీవుడ్ లో కలకలం రేగుతోంది. తనను తాను బిష్ణోయ్ అనుచరుడిగా పేర్కొంటూ హ్యారీ బాక్సర్ అనే వ్యక్తి ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు. తన డిమాండ్లను అంగీకరించకపోతే వారితో పాటు వారి సిబ్బందినీ హత్య చేస్తామని హెచ్చరించాడు.
మెసేజ్ లో ఏముందంటే..
"రణ్ వీర్ సింగ్.. నీ భవిష్యత్తులో ఏడు తరాలు గుర్తుండిపోయేలా నిన్ను హత్య చేస్తాం. నువ్వు మా బెదిరింపులను లెక్క చేయకపోగా మిగతా వారికీ ఉచిత సలహాలు ఇస్తున్నావు. పోలీసులకు ఫిర్యాదు చేసేలా వారిని ప్రోత్సహిస్తున్నావు. నువ్వు కూడా ఓ కంప్లైంట్ చేసినట్టున్నావు.. పర్వాలేదు. ఇక నీకు మామూలుగా చెప్పం. నీ దగ్గర ఎవరెవరు పనిచేస్తున్నారు. వారు ఎప్పుడు వస్తారు, ఎప్పుడు వెళతారు.. వారి కుటుంబాలు ఎక్కడ ఉంటున్నాయనే వివరాలు మొత్తం మా దగ్గర ఉన్నాయి. వారితో మొదలు పెడతాం. ఒక్కొక్కరినీ టార్గెట్ చేసి చంపేస్తుంటే అప్పుడు నీకు తెలిసివస్తుంది. నీకు ఇంకా టైముంది. హత్యలు మొదలయ్యే లోపే మేలుకో" అంటూ దుండగుడు బెదిరించాడు. దర్శకుడు రోహిత్ శెట్టికి కూడా ఇది వర్తిస్తుందని హెచ్చరించాడు.

# ఎన్నికలకు ముందు మహిళలకు సీఎం స్టాలిన్ 'ముందస్తు' కానుక

తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికార డీఎంకే ప్రభుత్వం మహిళలకు మరో ఆకర్షణీయ కానుక అందించింది. 'కలైంజ్ఞర్ మహిళా హక్కుల పథకం' కింద 1.31 కోట్ల మంది లబ్ధిదారులకు ముందస్తు మూడు నెలల ప్యాకేజీని విడుదల చేసింది. ముందస్తు రూ.3,000తో పాటు వేసవి ప్రత్యేక ప్యాకేజీ కింద మరో రూ.2,000... మొత్తం రూ.5,000 లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. ముఖ్యమంత్రి స్టాలిన్ సోషల్ మీడియాలో ఈ వివరాలు వెల్లడించారు.ఎన్నికల సాకుతో ఈ సాయాన్ని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని స్టాలిన్ విపక్షాలపై మండిపడ్డారు. ఈ కారణంగానే, ముందస్తుగా నిధులు విడుదల చేశామని తెలిపారు. మళ్లీ గెలిస్తే ప్రస్తుతం ఇస్తున్న నెలవారీ రూ.1,000 సాయాన్ని రూ.2,000కు పెంచుతామని హామీ ఇచ్చారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ఇచ్చే సామాజిక భద్రతా పింఛన్లను రూ.1,200 నుంచి రూ.2,000కు పెంచుతామని తెలిపారు.తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఈ ఏడాది ప్రథమార్థంలో ఎన్నికలు జరగనున్నాయి. 2021లో డీఎంకే 133 స్థానాల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

# వాకౌట్ చేయడం వైసీపీకి ఫ్యాషన్‌గా మారింది

దీనిపై మంత్రి లోకేశ్ స్పందిస్తూ, మండలి వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు లేవని చెబుతున్నారని, 2020- 2021 ఏడాది క్యూ-4 పెండింగ్ 683.1 కోట్లు, 2023-24 క్యూ-2, క్యూ-3, క్యూ-4 బకాయిలు 1753.98 కోట్లు, 2023-24 ఏడాది గమనిస్తే ఎంటీఎఫ్ ఎరియర్లు సుమారు రూ.895 కోట్లు బకాయిలు పెట్టారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించినట్లు సభ్యులు చెబుతున్నారని, ప్రభుత్వం మారే సమయంలోనూ రూ.645 కోట్ల బకాయిలు చెల్లించలేదని అన్నారు.తాను ఈ విషయాలను పూర్తి ఆధారాలతో చెబుతున్నానని లోకేశ్ అన్నారు. విద్యాశాఖ మంత్రిగా మాట్లాడేందుకు తనకు హక్కు ఉందని స్పష్టం చేశారు.ఈ వ్యాఖ్యలపై బొత్స స్పందిస్తూ, వైసీపీ హయాంలో రూ.4 వేల కోట్ల బకాయిలు లేవని, రెండు వాయిదాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఈ ప్రభుత్వం ఇంటర్ విద్యను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇందుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నట్లు చెప్పారు.
వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం
వైసీపీ వాకౌట్ చేయడంపై నారా లోకేశ్ స్పందించారు. "నిజాలు చేదుగా ఉంటాయి. వైసీపీ సభ్యులు అబద్ధాలు చెప్పి బయటకు వెళుతున్నారు. ఇంటర్ విద్యపై దృష్టి పెట్టడం లేదంటున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 70 వేల మంది విద్యార్థులు పెరిగారు. అదీ ఈ ప్రభుత్వ చిత్తశుద్ధి. వైసీపీ ఐదేళ్ల కాలంలో కనీసం పుస్తకాలు, బ్యాగ్స్ ఇవ్వలేదు. మధ్యాహ్న భోజనం రద్దు చేసి వెళ్లిపోయారు. ఇప్పుడు మమ్మల్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదు. మేం ఇంటర్ లో మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరించాం. పుస్తకాలు ఇస్తున్నాం. టెన్త్, ఇంటర్ విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నాం. వాకౌట్ చేయడం వైసీపీకి ఫ్యాషన్. ఈ తలుపు నుంచి వెళతారు. హాయిగా టీ తాగి ఆ తలుపు నుంచి వస్తారు" అని ఎద్దేవా చేశారు.చిత్తశుద్ధి ఉంటే వైసీపీ మా ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే సమాధానం ఇస్తున్నామని అన్నారు. సమస్యలు లేవని మేం చెప్పడం లేదన్నారు. వాటిని వినడానికి అలాగే పరిష్కరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు.పరదాలు కట్టుకుని తాము తిరగడం లేదని మంత్రి లోకేశ్ అన్నారు. ఇప్పుడు అసెంబ్లీకి ముఖ్యమంత్రి వస్తుంటే ప్రజలు నవ్వుతూ చేతులు ఊపుతున్నారని, గత ముఖ్యమంత్రి మాత్రం రోడ్లపై 3వేల మంది పోలీసులను పెట్టేవారని ఎద్దేవా చేశారు. నాడు యుద్ధవాతావరణం ఉండేదని అన్నారు. ఇప్పుడు ప్రజలు ప్రశాంతంగా, హాయిగా తిరగగలుగుతున్నారని, ఇదీ తమ చిత్తశుద్ధి అన్నారు. ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదని, విపక్ష నేతను పిలిపించాలని అన్నారు. వైసీపీ హయాంలో 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరం అయ్యారని విమర్శించారు. ప్రశ్నించే హక్కు తనకు ఉందని, వైసీపీకి చిత్తశుద్ధి ఉంటే చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

# తిరుమలలో అపచారాలకు నాటి పాలక మండలే కారణం:

శుక్రవారం సచివాలయం నుంచి శ్రీకాళహస్తి గిరిప్రదక్షిణ మార్గాన్ని పవన్ కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించారు. సుమారు రూ.10 కోట్ల వ్యయంతో ఈ రహదారిని నిర్మించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, దేవాదాయ శాఖ కార్యదర్శి డాక్టర్ హరి జవహర్ లాల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. "మన ఆలయాలు నాగరికతకు, సంస్కృతికి, వారసత్వానికి చిహ్నాలు. వాటి పరిరక్షణ మనందరి బాధ్యత. గత ప్రభుత్వం ఆలయాల పరిరక్షణను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నేతృత్వంలో ఆలయాల అభివృద్ధికి, ధర్మ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నాం," అని అన్నారు. అరుణాచలంలో మాదిరిగా శ్రీకాళహస్తిలోనూ గిరిప్రదక్షిణ చేయాలన్న కోరిక తనకు ఉందని, త్వరలోనే క్షేత్రాన్ని సందర్శించి స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటానని తెలిపారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్గనిర్దేశకత్వంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలోని ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు పవన్ కల్యాణ్ వివరించారు. దేవాదాయ శాఖ సహకారంతో రూ.40 కోట్లకు పైగా నిధులతో 22 ప్రధాన దేవాలయాలకు రహదారి వసతి కల్పిస్తున్నామని తెలిపారు. కోటప్పకొండ, వాడపల్లి సహా అనేక క్షేత్రాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం గిరిప్రదక్షిణ మార్గంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామని చెప్పారు. అరుణాచలం తరహాలో ప్రతి పౌర్ణమికీ శ్రీకాళహస్తిలో కైలాసగిరి ప్రదక్షిణ నిర్వహించాలని నూతన పాలక మండలికి ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నుంచి తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆలయ ఛైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, ఆలయ ఈవో బాపిరెడ్డి, ఇతర అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు

# దేవాలయాల పవిత్రతను కాపాడతాం

రాష్ట్రంలో జరిగిన విధ్వంసంపై అధికారంలోకి రాగానే 7 శ్వేతపత్రాలు విడుదల చేశామని గుర్తుచేశారు."మేము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మాకు అందిన ఫిర్యాదుల్లో అత్యధికం భూ వివాదాలకు సంబంధించినవే. గత పాలకులు అడిగిన భూములు ఎవరైనా ఇవ్వకపోతే, వాటిని వెంటనే 22ఏ జాబితాలో పెట్టేసి వేధించారు. స్వయంగా చట్టాలు చేసిన ముఖ్యమంత్రే ఇలా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే బాధితులు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. తాడేపల్లి ప్యాలస్ సమీపంలో హెలిప్యాడ్, అప్రోచ్ రోడ్ నిర్మాణం కోసం ఓ భూమి అడిగారు. అది ఇవ్వలేదని బలవంతంగా 22ఏలో చేర్చేశారు. రూ.33 లక్షలతో నిర్మాణం కోసం జీవో కూడా ఇచ్చేశారు.గత పాలకులు చేసిన పాపాలు కడగడానికే మాకు ఏడాది సమయం పట్టింది. మదనపల్లిలోని ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను తగులబెట్టడం వాళ్ల అరాచకాలకు నిదర్శనం. అందుకే, 2026 నాటికి ఈ రెవెన్యూ రికార్డులన్నీ ప్రక్షాళన చేసి, ప్రతి ఒక్కరి భూమికి భద్రత కల్పించేలా రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాలు జారీ చేయాలని నిర్ణయించాం. భూములే కాదు, ఇసుకను కూడా వదలకుండా దోపిడీ చేశారు.తిరుపతి లడ్డూ వ్యవహారం చాలా సున్నితమైన అంశం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులు పవిత్రంగా భావించే శ్రీవారి దర్శనం, ప్రసాదం విషయంలోనూ వాళ్లు రాజకీయాలు చేశారు. దేవుడి పవిత్రతను, భక్తుల మనోభావాలను దెబ్బతీయాలని ప్రయత్నించారు. జరిగిన తప్పులను మేం చెప్పకుండా ఉంటే, ఆ అపవిత్రతను కొనసాగించడానికి వాళ్లు వెనుకాడరు. అందుకే, టీటీడీ సహా అన్ని దేవాలయాల్లో పవిత్రతను కాపాడే బాధ్యతను మా కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది.వివేకా హత్య కేసులో వాళ్లు ఎన్ని నాటకాలు ఆడారో అందరూ చూశారు. 'నారాసుర రక్త చరిత్ర' అంటూ సాక్షి పత్రికలో రాసి, ఆ నేరాన్ని మాపై నెట్టాలని చూశారు. ఇప్పుడు అదే తరహాలో కల్తీ నెయ్యి వివాదాన్ని మా కుటుంబ సంస్థ అయిన హెరిటేజ్‌కు అంటగట్టి, బ్రాండ్ ప్రతిష్టను దెబ్బతీయాలని కుట్ర చేస్తున్నారు. గతంలో రాయలసీమలో ఫ్యాక్షన్ రాజకీయాల్లో భాగంగా ప్రత్యర్థులను ఆర్థికంగా దెబ్బతీయడానికి చీనీ చెట్లను నరికివేసేవారు. ఇప్పుడు అదే ఫ్యాక్షన్ బుద్ధితో మా వ్యాపారాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారు. శాంతిభద్రతల విషయంలో మేం కఠినంగా వ్యవహరిస్తాం. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు" అని చంద్రబాబు హెచ్చరించారు.

# పూర్తి గీతాన్ని ఆలపించాలన్న కేంద్రం నిర్ణయాన్ని స్వాగతించాలి

ఇప్పటివరకు మనం పాడుతున్న వందేమాతరం గీతం సగమేనని తెలుసా?... అయితే పూర్తి గీతం ఎలా ఉంటుందో రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి తన ట్వీట్ లో పంచుకున్నారు. వందేమాతరం' పూర్తి గీతాన్ని తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకుంటూ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటివరకు పాడిన సగం గీతం బానిసత్వానికి నిదర్శనమని, ఈ దుస్థితిని మార్చి పూర్తి 'వందేమాతరం' గీతాన్ని ఆలపించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతిఒక్కరూ సమర్థించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా విజయసాయి తన అభిప్రాయాన్ని వివరిస్తూ, "విదేశీ పాలకులు వెళ్లిపోయినా, విదేశీ మతాలు మన మధ్యే మిగిలిపోయాయి. అవి మన సంస్కృతిపై పరిపాలన చేయాలని చూస్తున్నాయి. భారతదేశంలో పుట్టిన మనకు మనసు ఉండదా? ఇప్పటికీ బానిసత్వపు సంకెళ్లేనా?" అని ప్రశ్నించారు.గత 120 సంవత్సరాలుగా విదేశీ మతాల వారు ఏమనుకుంటారోనన్న భయంతోనే సగం 'వందేమాతరం' గీతాన్ని పాడామా..? అని ఆయన నిలదీశారు. "మన జాతీయ గేయంలో మన అమ్మవార్ల పేర్లు ఉండకూడదా?" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితిని మార్చి, పూర్తి 'వందేమాతరం' గీతాన్ని పాడాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అందరూ స్వాగతించాలని విజయసాయిరెడ్డి కోరారు.

# వెల్దుర్తి బీసీ బాలికలవసతి గృహాన్ని తనిఖీ చేసిన జిల్లా బీ.సీ వెల్ఫేర్ ఆఫీసర్ కే.ప్రసూన

కర్నూలు జిల్లా మండల కేంద్రమైన వెల్దుర్తి బీ.సీ. బాలికల వసతి గృహాన్ని కర్నూలు జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కే.ప్రసూన ఆకస్మిక తనిఖీ చేశారు.వెల్దుర్తి బీసీ బాలికలవసతి గృహానికి సంబంధించిన పదవ తరగతి విద్యార్థినిలు 100 శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటాలని పోయిన ఏడాది విద్యార్థిని ల మార్కులను దాటేలా కృషి చేయాలని విద్యార్థినీలకు పరీక్షల్లో విజయం సాధించడానికి అవగాహన కల్పించారు. స్టాక్ రిజిస్టర్, కిచెన్, విద్యార్థినిల విశ్రాంతి గదులు, వాష్రూమ్స్, విద్యార్థుల స్టడీ రూమ్స్, మరియు హాస్టల్ ప్రాంగణం అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. వసతి గృహము చాలా పరిశుభ్రంగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు.
వసతి గృహాన్ని ఉత్తమంగా తీర్చిదిద్ది పరిశుభ్రతను పాటించి విద్యార్థినుల ఉత్తమ ఫలితాల కోసం కృషి చేస్తున్న వసతి గృహ అధికారిణి గిరిజాదేవిని కే.ప్రసూన ప్రశంసించారు.



# అంబటిని వేధించిన వారంతా మూల్యం చెల్లించుకోక తప్పదు

ఏపీ రాజకీయాల్లో మాజీ మంత్రి అంబటి రాంబాబు అరెస్ట్ వ్యవహారం వేడి పుట్టిస్తోంది. ఈ అంశంపై శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అంబటి రాంబాబు తల్లిని తిడితే ఒకటి... మీ తల్లిని అంటే ఒకటా? అని ఆయన ప్రశ్నించారు. మహిళల విషయంలో ఎవరు తప్పు చేసినా తప్పేనని అన్నారు. అంబటి రాంబాబు తల్లిని తిట్టిన వీడియోలు ఉన్నాయని తెలిపారు. అంబటిపై దాడి చేయడం వల్లే ఆయన ఘాటుగా స్పందించారని బొత్స అన్నారు. ఆయన విజ్ఞత కలిగిన వ్యక్తి కాబట్టే క్షమాపణ చెప్పారని తెలిపారు. అంబటిని వేధించిన వారంతా భవిష్యత్తుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధుల ఇళ్లపై దాడి చేయడం సరికాదని అన్నారు. మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటిపై కూడా దాడి చేశారని విమర్శించారు. మహిళలను బయటకు తీసుకొచ్చి రాజకీయ మైలేజీ కోసం ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

# పాఠశాలలలో వంద రోజుల ప్రణాళికను తనిఖీ చేసిన డిఇఓ

విజేత,ప్యాపిలి:
స్థానిక మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వందరోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డి పి.ఆర్.పల్లి ఉన్నత పాఠశాల, హుసేనాపురం ఉన్నత పాఠశాల, బూరుగల ఉన్నత పాఠశాల, సీతమ్మ తండా ఆశ్రమ పాఠశాల, నేరేడుచర్ల మోడల్ ప్రాథమిక పాఠశాల,బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల మరియు కస్తూరిబా పాఠశాలలను సందర్శించడం జరిగింది. వంద రోజుల ప్రణాళికలో భాగంగా పదవ తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రీ ఫైనల్ పరీక్షలు తనిఖీ చేయడం జరిగింది. అదేవిధంగా ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రగతి గురించి 100% ఉత్తీర్ణత సాధించడానికి ఏ విధంగా విద్యార్థులను సన్నధం చేయాలో, వారికి బోధన మాత్రమే కాకుండా బలురు మరియు బాలికలకు అవసరమైన అన్ని విషయాలలో కావలసిన సలహాలు సూచనలు ఇస్తూ వారి అభివృద్ధికి తోడ్పడాలని సూచించడం జరిగింది. అదేవిధంగా ఆశ్రమ పాఠశాలలో తనిఖీల భాగంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సంబంధించి వంట నిర్వాహకులకు తగిన సూచనలు చేయడం జరిగింది. ఉదయం 8.00 గంటలకు పి.ఆర్ పల్లె ఉన్నత పాఠశాలలో సబ్జెక్టులు ఉపాధ్యాయులు కాకుండా ఇతర ఉపాధ్యాయులు ఉండడంతో ఉపాధ్యాయుల మీద ఆగ్రహం వ్యక్తం చేశారు.మరియు 55 విద్యార్థులకు గాను 9 మంది విద్యార్థులు మాత్రమే ఎనిమిది గంటలకు హాజరు కావడం జరిగింది. కావున ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని




హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారితో పాటు జిల్లా ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్ జగన్మోహన్ రెడ్డి, మండల విద్యాధికారులు మహేశ్వర్ రెడ్డి వెంకటేశ్వర నాయక్ , సీఆర్పీలు రామాంజనేయులు, నవీను పాల్గొన్నారు

# 15న టిఎస్ఆర్ ఆధ్వర్యంలో " 41వ మహా కుంభాభిషేకం

## -సాగర తీరాన పండుగ వాతావరణాన్ని తలపించేలా మహాశివరాత్రి వేడుకలు

## -పవిత్ర జలాలు, పళ్ళ రసాలతో శివలింగానికి భక్తులతో అభిషేకం





విజేత విశాఖ బ్యూరో::కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ టి.సుబ్బరామి రెడ్డి ఆధ్వర్యంలో విశాఖపట్నం ఆర్కే బీచ్ సాగర తీరాన మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 15న ఆదివారం 41వ మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఉత్సవ కన్వీనర్, తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి రామ్ తెలిపారు, శుక్రవారం ఉదయం టిఎస్ఆర్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, ఈ ప్రాంతానికి ప్రకృతి వైపరీత్యాల వలన ఎటువంటి ఆపద కలగకూడదనే సంకల్పంతో 40 ఏళ్ళ కిందట డా. టి.సుబ్బరామిరెడ్డి ఆర్కే బీచ్ వద్ద మహా కుంభాభిషేకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు,ప్రతి ఏటా అంగరంగ వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారని,అదే ఆనవాయితీతో ఈ ఏడాది కూడా ఆర్కే బీచ్ వద్ద మహా కుంభాభిషేకానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు,జనసేన నాయకులు బెహరా భాస్కరరావు మాట్లాడుతూ సాగర తీరాన పండుగ వాతావరణాన్ని తలపించేలా మహాశివరాత్రి వేడుకలు ప్రతి ఏటా నిర్వహిస్తున్న డా. టి సుబ్బరామిరెడ్డి అభినందనీయులన్నారు,కాకినాడ భారత యజ్ఞపీఠం ప్రతినిధి, ఉత్సవ నిర్వాహకులు రత్నాల చంద్రశేఖర్ మాట్లాడుతూ టి .సుబ్బరామిరెడ్డి సొంత నిధులతో ప్రతి ఏటా నిర్వహిస్తున్న మహా కుంభాభిషేకానికి తన తాతగారైన శివ భక్తులు శ్రీకారం చుట్టారని, ఆ తర్వాత తన తండ్రి చిన్నబాబు ఉత్సవాలు నిర్వహించినట్టు చెప్పారు,భక్తులచే స్వయంగా పవిత్ర జలాలు, పళ్ళ రసాలతో శివలింగానికి అభిషేకాన్ని స్వయంగా టిఎస్సార్ చేయించనున్నట్లు తెలిపారు,భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చేసిన ఏర్పాట్లను వివరించారు,టి ఎస్ ఆర్ కార్యదర్శి ఎస్ కే భాష మాట్లాడుతూ భక్తులకు రుద్రాక్షలు, పసుపు తాళ్ళు, ప్రసాదాలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు,ఉదయం 9 గంటల నుండి ఒంటిగంట వరకు జరిగే మహా కుంభాభిషేకంలో ,మధ్యాహ్నం జరిగే హోమం, పూర్ణాహుతి కార్యక్రమాల్లో డాక్టర్ టి సుబ్బరామిరెడ్డి పాల్గొంటారని,సాయంత్రం ఐదు గంటలకు ఆధ్యాత్మిక సభ నిర్వహించనున్నామన్నారు,ఈ మహాశివరాత్రి వేడుకల సందర్భంగా మహా కుంభాభిషేక కార్యక్రమానికి శివ భక్తులు, విశాఖ నగర ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పేడాడ రమణి కుమారి, జి.వి.రామచంద్రరావు, మువ్వలు సురేష్, ఈ.కృష్ణ చైతన్య, ఫిలిం డైరెక్టర్ వి.వంశి బాబు తదితరులు పాల్గొన్నారు.

# పీఎం సూర్య ఘర్ కింద రూ. 27.76 కోట్ల కేంద్ర ప్రోత్సాహకం

## -148.7 మెగావాట్ల రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటు

## -రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు లో విశేష ప్రగతికి జాతీయ స్థాయి గుర్తింపు

## -ఏపీఈపీడీసీఎల్ సీఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి

విజేత విశాఖ బ్యూరో::ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రిడ్ కనెక్టెడ్ రూఫ్‌టాప్ సౌర ప్లాంట్ల ఏర్పాటులో విశేష పురోగతి సాధించినందుకు ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) కు కేంద్ర ప్రభుత్వం రూ. 27.76 కోట్ల ప్రోత్సాహకాన్ని మంజూరు చేసినట్లు సంస్థ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు,నూతన మరియు పునరుత్పాదక శక్తి మంత్రిత్వ శాఖ (ఎంఎన్ఆర్ఈ), భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా 14 విద్యుత్ పంపిణీ సంస్థలకు కలిపి రూ. 1,422 కోట్లకు పైగా ప్రోత్సాహకాలు విడుదల చేయగా, అందులో ఏపీఈపీడీసీఎల్ ఒక ప్రధాన లబ్ధిదారుగా నిలిచిందని తెలిపారు, మహారాష్ట్రకు చెందిన ఎంఎస్ఈడీసీఎల్ , గుజరాత్ కు చెందిన పీజీవీసీఎల్, యూజీవీసీఎల్, డీజీవీసీఎల్, ఎంజీవీసీఎల్, టాటా పవర్-ఢిల్లీ, టీపీఎల్-అహ్మదాబాద్, టీపీఎల్- సూరత్, బీఎస్ఈఎస్ యమునా పవర్ లిమిటెడ్, కేరళ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్, టీజీఎస్పీడీసీఎల్, జేవీవీఎన్ఎల్- జైపూర్, నోయిడా పవర్ కంపెనీ లిమిటెడ్ సంస్థలకు ప్రోత్సాహకాలు లభించాయన్నారు,ఏపీఈపీడీసీఎల్ పరిధిలో గృహ వినియోగదారుల వద్ద రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల స్థాపనలో గణనీయమైన వృద్ధి నమోదవడం వల్లే ఈ ప్రోత్సాహకం లభించిందని తెలిపారు,ఇప్పటివరకు 46,603 మంది గృహ వినియోగదారులకు 148.7 మెగావాట్ల సామర్థ్యంతో రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసామన్నారు,ఈ ప్రోత్సాహక నిధులు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా రాష్ట్రంలో పునరుత్పాదక శక్తి వినియోగాన్ని మరింతగా పెంపొందించడంలో, వినియోగదారులకు నాణ్యమైన మరియు తక్కువ వ్యయంతో విద్యుత్ సరఫరా చేయడంలో కీలక పాత్ర పోషించనున్నాయని పేర్కొన్నారు, సంస్థ పరిధిలో మరిన్ని గృహాలకు రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను ప్రోత్సహించేందుకు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు,
ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన అమలులో ఏపీఈపీడీసీఎల్ సమర్థవంతంగా పనిచేసి ఈ కేంద్ర ప్రోత్సాహకాన్ని సాధించడం సంస్థకు గర్వకారణమన్నారు,
రాష్ట్రంలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల విస్తరణను మరింత వేగవంతం చేస్తూ, వినియోగదారులకు పారదర్శకమైన, సులభమైన సేవలను అందించడానికి సంస్థ సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు,
పునరుత్పాదక శక్తి వినియోగాన్ని పెంపొందిస్తూ రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ దిశగా ముందుకు తీసుకెళ్లడమే




ఏపీఈపీడీసీఎల్ లక్ష్యమని సీఎండి పృథ్వీతేజ్ తెలిపారు,
ఈ సందర్భంగా రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటులో అనుకున్న లక్ష్యాలను సాధించడంలో సహకరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, ఎంఎన్ఆర్ఈ, ఎన్ఆర్ఏడిసిఏపి అధికారులకు, వినియోగదారులకు సీఎండి పృథ్వీతేజ్ కృతజ్ఞతలు తెలిపారు

# ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకూడదు

### పట్టిసీమలో మహా శివరాత్రి ఉత్సవాలపై సమీక్ష సమావేశం.

### టెలి కాన్ఫరెన్స్లో వివిధ శాఖల వారితో మాట్లాడిన ఎమ్మెల్యే చిర్రీ బాలరాజు.



విజేత జీలుగుమిల్లి
పోలవరం మండలం పట్టిసీమలో ఈ నెల 15వ తేదీన జరగనున్న మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఉత్సవాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున శాంతి భద్రతల పరంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీస్, రెవెన్యూ, దేవాదాయ, వైద్య మరియు ఇతర శాఖల అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు.భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీరు, పారిశుధ్యం, లైటింగ్, పార్కింగ్, రవాణా సదుపాయాలు సమృద్ధిగా ఏర్పాటు చేయాలని సూచించారు. గోదావరి నదిలో స్నానాలకు వచ్చే భక్తుల భద్రత కోసం ప్రత్యేక బోట్ల పర్యవేక్షణ, రక్షణ సిబ్బంది నియామకం, బ్యారికేడ్ల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.అలాగే అత్యవసర వైద్య సేవల కోసం మెడికల్ క్యాంపులు, అంబులెన్స్ సదుపాయం సిద్ధంగా ఉంచాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అధికారులను కోరారు.భక్తులందరూ ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రశాంతంగా మహా శివరాత్రి ఉత్సవాలను నిర్వహించుకునేలా సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సూచించారు

# విశాఖ లొ ఎన్.ఐ.ఎస్ కేంద్ర్రాన్ని ఏర్పాటు చేయండి

విజేత గోపాలపట్నం:: విశాఖ లొ ఎన్.ఐ.ఎస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలంటూ ప్రభుత్వ విప్,విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను కోరారు, శుక్రవారం అసెంబ్లీ సమావేశం అనంతరం తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు తొ కలిసి చంద్రబాబు ను కలిసారు గణబాబు, విశాఖ లొ భారత ప్రభుత్వ సహకారంతో జాతీయ క్రీడా సంస్థ (చీxూ) కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి విజ్ఞప్తి చేస్తూ,ఈ కేంద్రం ఏర్పాటు



ద్వారా యువతకు ప్రపంచ స్థాయి శిక్షణ, కోచింగ్,క్రీడా విజ్ఞాన సదుపాయాలు,లభించి,క్రీడా ప్రతిభ అభివృద్ధి చెందుతుంది అని,ఇది ఆంధ్రప్రదేశ్ యువతకు మాత్రమే కాకుండా దేశక్రీభివృద్ధికి దోహదపడుతుందని,కావున విశాఖ లొ చీxూ కేంద్రం స్థాపనకు భారత ప్రభుత్వానికి సిఫార్సు చేయాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబు ను కోరారు.

# కోటప్పకొండకు ముస్తాబవుతున్న గణపవరం గ్రామ ప్రభ

చిలకలూరిపేట స్థానిక గణపవరం గ్రామంలో గత వారం రోజుల నుండి యువకులు చమటోర్చి కష్టపడి కోటప్పకొండకు ప్రభను సిద్ధం చేశారు గణపవరంలోని ప్రజల సహకారంతో పార్టీలకు అతీతంగా 45 అడుగుల ఎత్తు గ్రామ ప్రభను ఏర్పాటు చేసి కోటప్పకొండకు వెళ్లడానికి అన్ని హంగులతో భారీ ఏర్పాట్లతో అత్యంత ఉత్సాహంతో భక్తిశ్రద్ధలతో ప్రభను రథముపై ఏర్పాటు చేస్తున్నారు .ఈ కార్యక్రమంలో యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొని తమ వంతు బాధ్యతను చేయూతను అందిస్తున్నారు. ఇక్కడ కార్యక్రమంలో గ్రామ ప్రజలందరూ కూడా సహాయ సహకారాలు అందిస్తున్నందుకు ఆనందదాయకం



# బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఎన్నికలలో తన ఓటు హక్కును వినియోగించుకున్న శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్



విజేతచిలకలూరిపేట
బార్ కౌన్సిల్ ఎన్నికల్లో చిలకలూరిపేట పోలింగ్ కేంద్రం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సుగాలి కాలనీ నందు తన ఓటు హక్కును వినియోగించుకున్న శాసన మండలి సభ్యులు మర్రి రాజశేఖర్ గారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమం, న్యాయవ్యవస్థ బలోపేతం మరియు పారదర్శక పరిపాలనకు బార్ కౌన్సిల్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, న్యాయంగా నిర్వహించబడుతున్నందుకు నిర్వాహకులను అభినందించారు.ఒకవైపు శాసనమండలి సమావేశాలలో బిజీగా ఉంటూ ఆ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలు లేవనెత్తుతూ, మరోవైపు జరుగుతున్న బార్ కౌన్సిల్ ఎన్నికలలో పాల్గొని తన ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రజాస్వామ్యం పట్ల మర్రి రాజశేఖర్ కి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పలువురు అభిప్రాయపడ్డారు.

### బ్రహ్మోత్సవాలకు వాళీశ్వర స్వామి ఆలయంలో భద్రత కట్టుదిట్టం ఎస్సై ఉమా మహేశ్వర్ రెడ్డి

రామసముద్రం ఫిబ్రవరి 13 విజేత
రామసముద్రం మండలంలోని ఆర్ నడింపల్లె గ్రామ పంచాయతీ బల్లసముద్రం గ్రామసమీపంలో కొండలో కొలువైన శ్రీ వాళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి నట్లు ఎస్సై ఉమా మహేశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకురుల సమావేశంలో మాట్లాడుతూ మూడు రోజులు పాటు వాళీశ్వర స్వామి ఆలయానికి మా సిబ్బంది తో కలిసి కొండకు నడక దారిలో వెళ్లి ఆలయ పరిసరారాలను క్షుణ్ణం గా పరిశీలించామని,క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భక్తులకు పోలీస్ బందొబస్త్ ఏర్పాట్లు చేస్తామన్నారు, ఎవ్వరైనా ఆకతాయులు మిమ్మల్ని ఏదైనా ఘోరవ్ చేస్తే పోలీస్ ఫోన్ చేయాలన్నారు. కొండదగ్గర అక్కడ అక్కడ సీసీ కెమెరాలు పెడతా మని చెప్పారు.

## మహాశివరాత్రి కోటప్పకొండ తిరునాళ్ళు సందర్భంగా ప్రజల సౌకర్యార్థం

# పోలీస్ వారి ట్రాఫిక్ నిబంధనలు అందరూ పాటించాలి..

### -పల్నాడు జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు. - ట్రాఫిక్ రూల్స్ & డైవర్షన్

విజేత పల్నాడు జిల్లా
రాష్ట్ర పండుగ హోదా కలిగిన కోటప్పకొండ తిరునాళ్ళ కు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నలుమూలల నుండి మాత్రమే కాకుండా తెలంగాణ రాష్ట్రం నుండి కూడా భక్తులు శ్రీ త్రికోటేశ్వర స్వామి వారిని దర్శించుకోవడానికి వస్తూ వుంటారు. దూర ప్రాంతాల నుండి వచ్చే వారు శ్రీ త్రికొటేశ్వర స్వామి వారిని స్వేచ్ఛగా దర్శనం చేసుకుని తిరిగి వెళ్ళడానికి పోలీస్ శాఖ తరపున ఈ క్రింది ట్రాఫిక్ నిబంధనలు మరియు డైవర్షన్లను తెలియజేశారు.. నరసరావుపేట వైపు నుండి & వినుకొండ నుండి కోటప్పకొండ కు వచ్చు వాహనదారులు..
నరసరావుపేట నుండి & వినుకొండ నుండి కోటప్పకొండ కు వచ్చు భక్తులు పెట్లూరివారి పాలెం దగ్గర కోటప్పకొండ రూట్లోకి ఎంటర్ అయ్యి అచ్చుమ్మ పాలెం దాటిన తరువాత కుడి వైపు ఏర్పాటుచేసిన పార్కింగ్ ప్రదేశమునకు చేరుకొని క్రమ పద్ధతిలో వాహనాలను పార్క్ చేసుకొనవలెను. ఎలమంద గురువాయపాలెం, గోనేపూడి, చింతలపాలెం నుండి వచ్చు వాహనదారులు స్నానాల ఘాటు వద్ద ఉన్నటువంటి ఐరన్ బ్రిడ్జి మీదుగా వెళ్లి యాదవుల సత్రం ప్రక్కన ఉన్న పార్కింగ్ ప్రదేశంలో వాహనాలను పార్క్ చేసుకొనవలెను
చిలకలూరిపేట వైపు నుండి కోటప్పకొండకు వచ్చు వాహనదారులు..చిలకలూరిపేట మీదుగా వచ్చు భక్తులు చిలకలూరిపేట, పురుషోత్తమ పట్నం, ఎడవల్లి, యుటీజంక్షన్ మరియు తర్వాత ఉన్నటువంటి శారదా ఫార్మసీ కాలేజ్ వద్ద ఏర్పాటుచేసిన పార్కింగ్ ప్రదేశంలో పార్కింగ్ ప్రదేశంలో వాహనాలను పార్కు చేసుకొనవలెను.
చిలకలూరిపేట వైపు నుండి వచ్చే వారికి శారదా ఫార్మసీ కాలేజ్ దగ్గరలో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయబడి ఉన్నది తిరుగు ప్రయాణం వెళ్ళు వారు అక్కడి వరకు నడిచి వెళ్లి అక్కడినుండి బస్సుల ద్వారా చిలకలూరిపేట చేరుకొనవలెను.
చిలకలూరిపేట వైపు నుండి ట్రాక్టర్లు మరియు కార్లలో వచ్చు భక్తులు సాయంత్రం 4 గంటల తర్వాత ఎడవల్లి దగ్గర ఉన్నటువంటి అట్టల ఫ్యాక్టరీ రోడ్డు గూండా కట్టుబడి వారి పాలెం మీదుగా నిధికి చేరుకోవాలి.
అదేవిధంగా కోమటినేని వారి పాలెం కమ్మవారిపాలెం నుంచి వచ్చే వాహనాలు కట్టుబడి వారి పాలెం మీదుగా నిధికి చేరుకోవాలి.
కోటప్పకొండ టోల్గేట్ దగ్గరలో ఏర్పాటు చేసినటువంటి షటిల్ బస్సుల ద్వారా మాత్రమే భక్తులు కొండకు చేరుకోవాలి.
కొండపైకి ఎటువంటి ద్విచక్ర వాహనాలు మరియు కార్లు అనుమతించబడవు.
ప్రభలకు సంబంధించి నరసరావుపేట మరియు చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చేటువంటి మొక్కుబడి ప్రభలు 15వ తేదీ పగలు ముందుగా బయలుదేరి ఎలమంద గ్రామం మీదుగా స్నానాల ఘాట్, యాదవుల సత్రం మీదుగా రెడ్ల సత్రం పక్కన ఉన్నటువంటి వారికి కేటాయించిన ప్రదేశానికి రాత్రి 8 గంటల లోపు చేరుకొని ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా ప్రజలకు మరియు పోలీసు వారికి సహకరించాలి పెట్లూరి వారి పాలెం, కాకాని నుండి వచ్చు ప్రభలు ఏ ఏం రెడ్డి కాలేజీ దగ్గర ఎన్ ఎస్ పి కెనాల్ రోడ్డు మార్గం ద్వారా జాగ్రత్తగా ప్రభల హోల్టింగ్ ప్రదేశానికి చేరుకోవాలి.
ఆ సమయంలో పెట్లూరి వారి పాలెం నుండి ఏ ఎం రెడ్డి కాలేజీ వరకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసు వారికి సహకరించాలి.
ఇప్పటివరకు మొత్తం 29 (26 ఎలక్ట్రికల్ ప్రభలు, 3 నాన్ ఎలక్ట్రికల్ ప్రభలు (పెద్దవి)) వాటితో పాటు 49 నాన్ ఎలక్ట్రికల్ చిన్న ప్రభలు మరియు 100 పైగా మొక్కుబడి ప్రభలు వస్తూ ఉన్నవి. ఈ సందర్భంగా ప్రభల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆర్గనైజర్స్ ను సంబంధిత ఎమ్మార్వో వద్ద బైండోవర్ చేయడం జరిగింది.
ఒకవేళ బైండోవర్ ఉల్లంఘన జరిగినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడును.
ప్రభల పైన తిరునాళ్ల సందర్భంగా వేసే నృత్యాలలో అశ్లీలతకు చోటు లేకుండా ఆర్కెస్ట్రా టీమ్స్ ను కూడా బైండోవర్ చేయడం జరిగింది.
తిరునాళ్ల సందర్భంగా కోటప్పకొండకు వచ్చు భక్తుల సౌకర్యార్థం. దొంగతనాలు, మహిళల ను ఇబ్బంది పెట్టాలి అని చూసే వారిని కట్టడి చేయడానికి అన్నిచోట్ల మఫ్టీలో (సాధారణ దుస్తులలో) క్రైమ్ టీమ్స్ ను నియమించడం జరిగింది.మెట్ల మార్గంలో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ఉండటానికి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది.
స్నానాల ఘాట్
భక్తులు చిన్నపిల్లల విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకొనవలెను. కోటప్పకొండ తిరుణాల సందర్భంగా కోటప్పకొండకు వచ్చు అన్ని మార్గాలు, పార్కింగ్ ప్రదేశాలు, క్యూ లైన్స్ అన్నింటిని 200 జజ కెమెరాలు, 30 డ్రోన్స్ తో కవర్ చేస్తూ కొండపైన 1 కంట్రోల్ రూమ్, కొండ క్రింద 1 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సమన్వయం చేయడం జరుగుతుంది. తిరునాళ్లకు వచ్చు భక్తులు కానీ వారి కుటుంబ సభ్యులు కానీ తప్పిపోయినట్లయితే కొండ క్రింది నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన పోలీసు అవుట్ పోస్టు వద్ద కానీ, కొండ పైన రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్టు వద్ద కానీ లేదా మీరు ఉన్నచోట నుండి మీ దగ్గరలో ఉన్న ఏ పోలీసు వారికైనా తెలియపరిచినట్లయితే సంబంధిత వ్యక్తి వివరాలు కంట్రోల్ రూమ్ ద్వారా డ్యూటీలో ఉన్న పోలీస్ అధికారులకు తెలియపరచడం జరుగుతుంది.



తిరునాళ్లకు హాజరు అయ్యే భక్తులకు ఏమైనా ఇబ్బంది కలిగినట్లయితే పోలీసు వారు తెలిపిన 9440900885 నెంబర్ కు తెలపవలెను.
కోటప్పకొండ తిరునాళ్ళ సందర్భంగా తిరునాళ్ల ప్రశాంతంగా జరగడానికి ప్రజలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దర్శనం చేసుకునే విధంగా, ప్రభల వద్ద మరియు ఇతర ప్రదేశాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు గాను సుమారు 2,500 మంది పోలీసు అధికారులు, సిబ్బంది మరియు 9 ప్లటూన్ ల ప్రత్యేక పోలీసు బలగాలతో (మొత్తం సుమారు 3,000 మందితో) పోలీసు బందోబస్తు నిర్వహించడం జరుగుతుంది.తిరునాళ్లు ముగిసిన తర్వాత భక్తులు అందరూ వారి వాహనాలను వారికి కేటాయించినటువంటి రోడ్డు మార్గాన మాత్రమే వెళ్ళవలెను వ్యతిరేక మార్గాలలో వెళ్లి ట్రాఫిక్ జామ్ కావడానికి కారకులు కారాదు. అంతేకాకుండా పల్నాడు జిల్లాలోని ఇతర శైవ క్షేత్రాలు అయిన అమరావతి, గుత్తికొండ బిలం, దైద బిలం, సత్రశాల, ఏలేశ్వరం గట్టు, గోగులపాడు, మన్నేపల్లి తండా,సంజీవకొండ, వినుకొండ మరియు లింగంగుంట్ల (పెదకూరపాడు)లో కూడా ప్రత్యేకంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. కావున ప్రజలందరూ దర్శనానికి వెళ్లేటప్పుడు కానీ, బస్సులు ఎక్కేటప్పుడు కానీ, తిరునాళ్ల చూసేటప్పుడు కానీ, రోడ్ల మీద నడిచేటప్పుడు,రద్దీ సమయాలలో పార్కింగ్ ప్రదేశాలలో కానీ సంయమనం పాటిస్తూ పోలీసు వారికి సహకరించవలసిందిగా కోరుచున్నాము

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు

రామసముద్రం పిబ్రవరి 13 విజేత అన్నమయ్య జిల్లా మండలకేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో వార్షికోత్సవ వేడుకలు ప్రిన్సిపాల్ చిట్టి బాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎం ఈ వో హేమలత, మట్లవారిపల్లె హెచ్ ఎం వెంకటరణ నాయుడు, చెంబకూరు హెచ్ ఎం రమేష్, బ్ల్యూమింగ్ రోజస్ కరా స్పడెంట్ శశికళ,బాలాజీ, వీరిని ఉపాధ్యాయులు విద్యార్తులు సాధరంగా స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఈ వేడుకలను ప్రారంభం చేశారు. కాలేజీ ని ప్రాంగాణాన్ని పచ్చని తోరణాలు కట్టి పలు రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి విజయాలు సాధించాలని సూచించారు.ఒక కథ చెప్పారు ఒక సారి బస్ లో ఒక పేదింటి పిల్ల వారి తల్లి దండ్రులకు మొబైల్ ఫోన్ నాకు కావాలి అని అడిగిందని ప్రతి సబ్జెక్ట్ మొబైల్ వస్తుందని చెప్పారని ఆఅమ్మాయికి ఫోన్ వారి తల్లి దండ్రులు కొనివ్వడం జరిగిందని ఆ అమ్మాయి మొబైల్ వచ్చే మెసేజ్ లను బాగా చదివి నీట్ లో మొదటి ర్యాంక్ సంపాదించారని విద్యార్థుల కు తెలియజేసారు, మీరు మొబైల్ మంచికి వినియోగించుకొండి,ఇంటర్ విద్యార్థులు సమయపాలనతో చదువుతూ మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఒక వే యంతో చదివి మంచి ఉద్యోగాలతో స్థిరపడి తల్లి దండ్రులకు, విద్యనేర్పిన గురువులకు పేరు ప్రక్యాతలు తీసుకురావాలన్నారు. చెడు అలవాట్ల జోలికి వెళ్ళరాదన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈకళాశాల వార్షికోత్సవం లో పాల్గొన్నా ఎం ఈవో హేమలత



హెచ్ ఎం లు వెంకటరమణ నాయుడు, రమేష్, శశికళ కళాశాల లెక్చరర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

### పరీక్షల సన్నద్ధత, భూ సమస్యలపై సమీక్ష

విజేతఅమరావతి:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ శుక్రవారం సాయంత్రం సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుండి రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తు, పరిపాలనాపరమైన భూ సమస్యలపై కీలక ఆదేశాలు జారీ చేశారు.రానున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు, పదో తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి యంత్రాంగం సిద్ధంగా ఉండాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పక్కా ఏర్పాట్లు చేయాలని సీఎస్ సూచించారు. ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సానుకూల దృక్పథం పెంపొందించడం, ఏజెంట్ స్పేస్ కోసం



అవసరమైన డాక్యుమెంట్ అప్‌లోడ్ ప్రక్రియను వేగవంతం చేయడంపై చర్చించారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో ఎదురవుతున్న కార్యాలయాల స్థల సమస్యలు, అలాగే కోర్టు భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను కేటాయించే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తన క్యాంపు కార్యాలయం నుండి పాల్గొని, జిల్లాలో జరుగుతున్న ప్రగతిని మరియు పరీక్షల సన్నద్ధతను వివరించారు

## కౌతాళం మండలం హాల్వి గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ మరియు మంత్రాలయం టీడీపీ సొసైటీ చైర్మన్ ఎన్. రామకృష్ణారెడ్డి.

విజేత మంత్రాలయం:
మంత్రాలయం నియోజకవర్గం, కౌతాళం మండలం హాల్వి గ్రామంలో డా. బి.ఆర్. అంబేద్కర్ గారి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ,మంత్రాలయం టీడీపీ ఇన్చార్జి రాఘవేంద్ర రెడ్డి సోదరులు మంత్రాలయం సొసైటీ చైర్మన్ ఎన్.రామకృష్ణ రెడ్డి హాజరయ్యారు..మంత్రాలయం టీడీపీ ఇన్చార్జి రాఘవేంద్ర రెడ్డి సోదరులు రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణ సాధన కోసం నిరంతరం పోరాడి, 59 ఉపకులాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలలో రాజ్యాంగ ఫలాలు అందించేందుకు కృషి చేసిన మహనీయుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ని కొనియాడారు.గుండె జబ్బులతో బాధపడుతున్న పేద పిల్లలకు చికిత్స అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి చేసిన నాయకత్వం ఆయనదేనని తెలిపారు.పేదల సంక్షేమం విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని, అణగారిన వర్గాల అభివృద్ధికి కృషి కొనసాగుతుందని తెలిపారుసమాజంలోని అణగారిన వర్గాల హక్కుల కోసం ఇలాంటి నాయకత్వం అవసరం” అని రామకృష్ణ రెడ్డి పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నాయకులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి,చుడి సతీష్ నాయుడు,టిప్పు సుల్తాన్, నాడిగినేని అయ్యన్న, వెంకటపతి రాజు,మాలపల్లి వెంకటేష్, తోవి రామకృష్ణ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బొగ్గులు తిక్కన్న,యేసేబు విజయ్,జనసేన రామాంజి,అరివిలి వీరేష్, రంగారెడ్డి మరియు కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## స్మశాన వాటిక అభివృద్ధికి రెండు లక్షలు

### ముస్లిం సోదరుల ఆత్మీయ సమావేశంలో ప్రకటించిన వడ్డి



విజేత, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:
ముస్లింల స్మశాన వాటిక అభివృద్ధికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డీ రఘురామ్ నాయుడు రెండు లక్షల రూపాయలు విరాళంగా ప్రకటించారు. పట్టణం లోని 9వ వార్డులో ముస్లిం నాయకులు మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముస్లిం సోదరుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక ఇబ్బందు లు గురించి సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు విజ్ఞప్తి మేరకు వడ్డి రఘురామ్ నాయుడు ముస్లింల ఖభరిస్తాన్ (సమాధుల స్థలం)లో మెరక చేయుటకు రెండు లక్షలు రూపాయలు విరాళంగా ప్రకటించారు. వారికి ఎటువంటి సమస్య వచ్చినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమం లో 9వార్డు వైసీపీ ఇంచార్జ్ బూది దుర్గా ప్రసాద్, మాజీ టౌన్ ప్రెసిడెంట్ గుండుమోగుల నాగు, కలిశెట్టి తాతా రావు, గొర్రెల శ్రీనివాసరావు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థుల చేత వెట్టి చాకిరి నిర్మూలన ప్రతిజ్ఞ

### -జిల్లాలో అవగాహన కార్యక్రమాలు ముమ్మరం



విజేత రాజమహేంద్రవరం
తూర్పు గోదావరి జిల్లా: రాజమహేంద్రవరం రూరల్
సమాజంలో వెట్టి చాకిరి వంటి బానిసత్వానికి తావులేకుండా చేయాలని సంకల్పంతో వెట్టి విమోచన కోలిషన్ (వి వి సి) తూర్పు గోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నామవరంలోని జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు.జిల్లా కో-కన్వీనర్ ఎం.వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ, వెట్టి చాకిరి చట్టపరంగా నేరమని, అప్పుల పేరుతో కార్మికులను బంధించడం తీవ్ర శిక్షార్హమని వివరించారు. తమ చుట్టుపక్కల ఎవరైనా ఇలాంటి దుస్థితికి గురైతే భయపడకుండా అధికారులకు తెలియజేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం “వెట్టి చాకిరి నిర్మూలనకు కట్టుబడి ఉంటాం” అంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.
కార్యక్రమంలో కోలిషన్ సభ్యులు రేవంత్, సహ-కన్వీనర్లు, ప్రధానోపాధ్యాయురాలు ప్రశాంతి, ఉపాధ్యాయులు,విద్యార్దులు, పాల్గొన్నారు.ఇక రాజమహేంద్రవరం రూరల్, సిటీ ప్రాంతాల్లోనూ ప్రచారాన్ని విస్తరించారు. ఫ్యాక్టరీలు, చిన్న పరిశ్రమలు, ఆటో స్టాండ్ల వద్ద కార్మికులతో ప్రత్యక్షంగా మాట్లాడి చట్టంపై అవగాహన కల్పించారు. ఆటోల్లో మైక్ ద్వారా ఆడియో ప్రకటనలు ప్రసారం చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో చట్టంపై విస్తృత ప్రచారం నిర్వహించారు. వెట్టి చాకిరి నేరమని, అప్పుల పేరుతో పనికి బంధించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు.